నామినేషన్ పత్రాల దాఖలులో జాగ్రత్త అవసరం

- నవంబర్ 3 నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం
- అభ్యర్థులు ఆర్‌ఓకు సమర్పించే పత్రాలే కీలకం
- జనరల్ అభ్యర్థులు రూ.10వేలు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.5 వేల డిపాజిట్ చేయాలి
- ఆర్‌ఓ వద్దకు అభ్యర్థితోపాటు నలుగురికి మాత్రమే అవకాశం

బీ కేర్‌ఫుల్

జంగ్ తెలంగాణ 2023



సాక్షి, మేడ్చల్ జిల్లా: అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియలో భాగంగా నవంబర్ 3 నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కానుండటంతో.. నామినేషన్ల దాఖలులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రాజకీయ పార్టీల అభ్యర్థులకు ఎన్నికల సంఘం పలు సూచనలు చేస్తోంది. వీటిని ఖచ్చితంగా పరిగణనలోని తీసుకోవాల్సింటుందని పేర్కొంటుంది. ఈ నేపథ్యంలోనే నామినేషన్ దాఖలు చేసే సమయంలో అభ్యర్థులు సమర్పించనున్న పత్రాలకు అత్యంత ప్రాధాన్యం ఉంటుంది. ఏ-ఫాం, బీ- ఫాం, అఫిడవిట్ తదితర అంశాల ప్రాముఖ్యతను అభ్యర్థులు పరిగణలోకి తీసుకోవాల్సి ఉంటుందని ఎన్నికల సంఘం పేర్కొంటోంది. అసెంబ్లీ ఎన్నికల్లో నామినేషన్ పత్రాలను దాఖలు చేసే అభ్యర్థిని ప్రతిపాదించే వ్యక్తి సంబంధిత నియోజకవర్గంలో ఓటరై ఉండాలి. గుర్తింపు పొందిన జాతీయ, రాష్ట్రస్థాయి పార్టీలకు చెందిన అభ్యర్థిని అతను పోటీ చేస్తున్న నియోజకవర్గ పరిధిలోని ఓటరు ప్రతిపాదించాల్సింటుంది. స్వతంత్ర, గుర్తింపు లేని పార్టీల అభ్యర్థులను మాత్రం పది మంది ఓటర్లు ప్రతిపాదించాల్సి ఉంటుంది. ప్రతిపాదించే వారు తన ఓటరు జాబితా వివరాలను కూడా సమర్పించాల్సి ఉంటుంది.

- అభ్యర్థి నేరుగా లేదా తనను ప్రతిపాదించే వ్యక్తి నామినేషన్ పత్రాలను దాఖలు చేసేందుకు అవకాశముంది. అసెంబ్లీ నియోజకవర్గ స్థానంలో నామినేషన్ దాఖలుకు అభ్యర్థి వయస్సు 25 ఏళ్లు నిండి ఉండాలి. తెలంగాణ రాష్ట్ర పరిధిలోని ఏదైనా అసెంబ్లీ నియోజకవర్గంలో బరిలో నిలిచే అభ్యర్థికి ఖచ్చితంగా ఓటు హక్కు కలిగి ఉండాలి. నామినేషన్ పత్రాలు దాఖలు చేసే సమయంలో అభ్యర్థితో పాటు నలుగురి వ్యక్తులను మాత్రమే రిటర్నింగ్ అధికారి కార్యాలయంలోకి అనుమతిస్తారు. అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా జనరల్ స్థానంలో పోటీచేసే అభ్యర్థి రూ.10వేలు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులైతే రూ.5 వేలు డిపాజిట్(ధరావతు) చెల్లించాల్సి ఉంటుంది. ఈ డిపాజిట్ సొమ్మును బ్యాంకు చలానా రూపంలో చెల్లించాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు కుల ధ్రువీకరణ పత్రాన్ని నామినేషన్ పత్రంతో జత చేయాలి. నామినేషన్ దాఖలు చేసే అభ్యర్థి ప్రత్యేకంగా బ్యాంకు ఖాతా తెరవాల్సి ఉంటుంది. ఈ బ్యాంకు ఖాతా ద్వారానే ఎన్నికల ఖర్చుల లావాదేవీలు నిర్వహించాల్సి ఉంది. బ్యాంకు ఖాతా వివరాలను నామినేషన్ పత్రంలో తప్పని సరిగా పేర్కొనాలి. అభ్యర్థి పది పాస్‌పోర్టు సైజ్ ఫొటోలను నామినేషన్ పత్రంతో జతపరచాలి. నామినేషన్ పత్రాల దాఖలు సమయంలో రిటర్నింగ్ అధికారి ఎదుట అభ్యర్థి ప్రతిజ్ఞ చేయాల్సింటుంది. గుర్తింపు పొందిన జాతీయ, రాష్ట్రస్థాయి పార్టీల అభ్యర్థులు తమ నామినేషన్ పత్రంతో పాటు పార్టీ జారీ చేసిన ఏ-ఫాం, బీ-ఫాం పత్రాలను సమర్పించాల్సి ఉంటుంది. అభ్యర్థి తన నేర చరిత్ర, తనపై నమోదైన పోలీసు కేసులు, ఇతరత్రా కోర్టులో విచారణలో ఉన్న కేసుల వివరాలతో సహా తనతోపాటు, భార్య, పిల్లల స్థిర, చరాస్తులు, అప్పులు, బ్యాంకులో డిపాజిట్లు, నగదు నిల్వ వివరాలు వెల్లడిస్తూ అఫిడవిట్ (ప్రమాణ పత్రం) సమర్పించాల్సి ఉంటుంది.

బీ-ఫాం అంటే..

పార్టీ తరపున ఎన్నికల రిటర్నింగ్ అధికారికి అందజేసే పత్రమిది. తమ పార్టీ నుంచి ఫలానా వ్యక్తి పోటీ చేస్తున్నారని, పార్టీ గుర్తు కేటాయించాలని అభ్యర్థించటమే ఈ బీ-ఫాం పత్రం ముఖ్యోద్దేశం.

ఏ ఫాం అంటే..

అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థిని ధ్రువీకరించేందుకు జాతీయ పార్టీ అధ్యక్షుడు, రాష్ట్రస్థాయిలో ఒకరికి అధికారం అప్పగిస్తారు. అభ్యర్థికి సదరు వ్యక్తి బీ- ఫాం జారీ చేస్తారు. రాష్ట్ర స్థాయి గుర్తింపు పొందిన పార్టీ అధ్యక్షుడు తాను లేదా మరొకరికి, లేదా జిల్లాస్థాయిలో ఒకరికి బీ-ఫాం జారీచేసే అధికారాన్ని అప్పగిస్తుందని ఏ- ఫాం సూచిస్తోంది. ఏ- ఫాం ద్వారా అధికారం పొందిన వ్యక్తి పోటీచేసే అభ్యర్థికి బీ-ఫాం ఇస్తారు. ఏ-ఫాం, బీ-ఫాం పత్రాలు నామినేషన్ దాఖలు సమయంలో లేదా నామినేషన్ పత్రాల దాఖలు చివరి రోజు మధ్యాహ్నం 3 గంటల్లోగా సంబంధిత రిటర్నింగ్ అధికారి (ఆర్‌ఓ)కి అందించాల్సి ఉంటుందని జిల్లా ఎన్నికల సంఘం పేర్కొంటోంది.

ఎన్నికల ఏర్పాట్లపై ఆరా



ఆర్‌ఓ రవికిరణ్‌తో మాట్లాడుతున్న అడిషనల్ సీపీ తరుణ్‌జోషి

మల్కాజిగిరి: మల్కాజిగిరి నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి కార్యాలయాన్ని బుధవారం రాచకొండ అడిషనల్ సీపీ తరుణ్‌జోషి, డీసీసీ ధరావత్ జానకి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్‌ఓ రవికిరణ్, ఈఆర్‌ఓ రాజును అడిగి ఏర్పాట్ల గురించి వివరాలు సేకరించారు. ఆర్‌ఓ కార్యాలయం సమీపంలో తీసుకోవాల్సిన భద్రతాచర్యలు, బందోబస్తు గురించి ఏసీపీ రవీందర్, సీఐ ప్రవీణ్‌కుమార్‌కు సూచనలు చేశారు.

పోలింగ్ బూత్‌లను సందర్శించిన ఆర్వో



వివరాలను తెలుసుకుంటున్న ఆర్వో అభిషేక్ అగస్త్య

మల్లాపూర్: మల్లాపూర్ డివిజన్ పరిధిలోని పోలింగ్ బూత్‌లను ఉప్పల్ ఆర్వో అభిషేక్ అగస్త్య(ఐపీఎస్) సందర్శించారు. మల్లాపూర్ జిల్లా పరిషత్ హైస్కూల్‌లోని పోలింగ్ బూత్, కేంద్రాల్లోని సౌకర్యాలు, ఓటర్ల జాబితా, ఓటర్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వార్డు అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ రాజుగౌడ్, సూపర్‌వైజర్ ఎం.ముఖేష్, ఖలీమ్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లోకి కాంగ్రెస్ శ్రేణులు



మంత్రి కేటీఆర్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరుతున్న నక్కా రాజశేఖర్‌గౌడ్ బృందం

అల్వాల్: బీఆర్‌ఎస్ గెలుపునకు కృషి చేయాలని మంత్రి కేటీఆర్ అన్నారు. బుధవారం అల్వాల్‌కు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నక్కా రాజశేఖర్‌గౌడ్, వరప్రసాద్‌రెడ్డి, మహేందర్‌పాల్ సింగ్, నక్కా శివమంచి, స్టీఫెన్, రాంబాబు, సతీష్‌తోపాటు మరో 50 మంది కేటీఆర్ సమక్షంలో మల్కాజిగిరి బీఆర్‌ఎస్ అభ్యర్థి మర్రి రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్‌లో చేరారు.

ఆశీర్వదించండి అభివృద్ధి చేసి చూపిస్తా

- తెలంగాణ ఉద్యమంలో న్యాయవాదుల పాత్ర కీలకం
- బండారి లక్ష్మారెడ్డికి న్యాయవాదుల మద్దతు



సమావేశంలో మాట్లాడుతున్న బండారి లక్ష్మారెడ్డి

కాప్రా: మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కోర్టు న్యాయవాదుల ఆధ్వర్యంలో బుధవారం కాప్రాలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ఉప్పల్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి, మల్కాజిగిరి బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి మర్రి రాజశేఖర్‌రెడ్డి హాజరై రాష్ట్ర న్యాయవాదుల ఆత్మీయ సమావేశం పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో న్యాయవాదుల పాత్ర కీలకమైందన్నారు. బీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత న్యాయవాదుల సంక్షేమం కోసం సీఎం కేసీఆర్ రూ.100 కోట్లు కేటాయించారని గుర్తు చేశారు. న్యాయవాదులంతా బీఆర్‌ఎస్‌కు ఓటు వేసి కేసీఆర్‌ను మూడోసారి ముఖ్యమంత్రి చేయాలని కోరారు. అనంతరం న్యాయవాదులు బీఆర్‌ఎస్‌కు పూర్తి మద్దతు తెలిపి ఉప్పల్ నుంచి బండారి లక్ష్మారెడ్డిని, మల్కాజిగిరి నుంచి మర్రి రాజశేఖర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించి సీఎం కేసీఆర్‌కు బహుమతిగా ఇస్తామన్నారు. కార్యక్రమంలో ఉప్పల్ నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి రావుల శ్రీధర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి తాడూరి శ్రీనివాస్, మాజీ బార్ అధ్యక్షులు యాదగిరిరావు, రవికాంత్, సుధీర్‌కుమార్, ఖలీల్‌బాయ్, వైస్ ప్రెసిడెంట్ కిరీటిరెడ్డి, బార్ స్పోర్ట్స్ అసోసియేషన్ సెక్రటరీ సునీతారాణి, న్యాయవాదులు రవికాంత్, సుధీర్‌కుమార్, లక్ష్మీనర్సయ్య, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

- నాచారంలో పలు కాలనీల్లో బండారి లక్ష్మారెడ్డి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. నాచారం సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు బీఆర్‌ఎస్‌కు మద్దతు ప్రకటించారు.
- కాప్రా చిన్నతరహా సూక్ష్మ పరిశ్రమల సమాఖ్య ప్రతినిధులు బీఆర్‌ఎస్ ఉప్పల్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డికి సంపూర్ణ మద్దతును ప్రకటించారు. తొమ్మిదేళ్లలో పారిశ్రామిక ప్రగతికి కేసీఆర్ అందించిన ప్రోత్సాహంతోనే బీఆర్‌ఎస్ అభ్యర్థికి తమ మద్దతు ప్రకటిస్తున్నట్లు సమాఖ్య ప్రతినిధులు పేర్కొన్నారు.

ఉప్పల్ టికెట్ నాదే.. గెలుపు నాదే..



బైక్‌యాత్రను ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్

కుషాయిగూడ: ఉప్పల్ టికెట్ నాదే.. గెలుపు నాదే నంటూ ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ స్పష్టం చేశారు. బుధవారం ఆయన ఏఎస్‌రావునగర్, చర్లపల్లి డివిజన్‌లలో పెద్ద ఎత్తున బైక్‌యాత్ర నిర్వహించారు. ఆయా డివిజన్లకు చెందిన బీజేపీ నేతలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. బాబు జగ్జీవన్‌రాం విగ్రహానికి నివాళులర్పించి యాత్రను చక్రీపురం చౌరస్తాలో ముగించారు. ఈ సందర్భంగా ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ మాట్లాడుతూ తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో చేసిన అభివృద్ధే తప్ప ఐదేళ్లలో అభివృద్ధి శూన్యమన్నారు. బీజేపీ అభ్యర్థిగా తానే పోటీలో ఉంటానని, అందులో ఎలాంటి సందేహం లేదన్నారు. బీజేపీ నాయకులు పద్మారెడ్డి, కొమ్ము నర్సింగ్, నాదం, కాసుల సురేందర్‌గౌడ్, లక్ష్మణ్‌గౌడ్, వెంకులు, ఇస్లావత్ హరినాయక్, చల్లా ప్రభాకర్, సహదేవ్, చంద్రకళ, శివకామేశ్వరి, జ్యోతిరెడ్డి, కళావతి, మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వ్యతిరేకతే గెలిపిస్తుంది



ప్రచారంలో మద్దతు కోరుతున్న కాంగ్రెస్ అభ్యర్థి మందుముల పరమేశ్వర్‌రెడ్డి

కుషాయిగూడ: బీఆర్‌ఎస్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకతే తనను గెలిపిస్తుందని ఉప్పల్ కాంగ్రెస్ అభ్యర్థి మందుముల పరమేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన మీర్‌పేట్-హెచ్‌బీకాలనీ డివిజన్‌లో నిర్వహించిన ఎన్నికల ప్రచార కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ప్రజలే స్వచ్ఛందంగా ముందుకు వచ్చి వారి మద్దతు ప్రకటిస్తున్నారని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలను ప్రజలకు వివరిస్తూ చెయ్యి గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని కోరుతూ ప్రచారం సాగించారు.

వినాయక దేవాలయ వార్షికోత్సవం



పూజల్లో కార్పొరేటర్ సునీతశేఖర్‌యాదవ్

మౌలాలి: మౌలాలి డివిజన్ ఈస్ట్ సుధానగర్‌లోని వినాయక దేవాలయ వార్షికోత్సవ వేడుకలు బుధవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి మౌలాలి కార్పొరేటర్ దంపతులు గున్నాల సునీతశేఖర్‌యాదవ్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాలయ సభ్యులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

ఘనంగా ధీటి మల్లయ్య జన్మదిన వేడుకలు



రామంతాపూర్: రామంతాపూర్‌కు చెందిన రాష్ట్ర మత్స్య శాఖ ఫెడరేషన్ వైస్ చైర్మన్ ధీటి మల్లయ్య జన్మదిన వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. వేడుకలకు బీఆర్‌ఎస్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి హాజరై ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన



వైద్య శిబిరంలో పేర్లు నమోదు చేసుకుంటున్న ప్రజలు

అల్వాల్: ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మల్కాజిగిరి బీఆర్‌ఎస్ అభ్యర్థి మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. బుధవారం మచ్చబొల్లారం డివిజన్ పరిధిలోని సూర్యనగర్ కాలనీలో మర్రి రాజశేఖర్‌రెడ్డి ఫౌండేషన్ ద్వారా అరుంధతి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 200 మంది హాజరై వివిధ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ కో-ఆప్షన్ సభ్యులు జ్యోతిగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, డోలి రమేష్, రమణారెడ్డి, గోపీకృష్ణ, ఢిల్లీ పరమేష్, ప్రశాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

ఉప్పల్: ఉప్పల్ లక్ష్మీనారాయణ కాలనీలో పేకాట ఆడుతున్న స్థావరంపై ఉప్పల్ పోలీసులు దాడి చేసిన ఘటన ఉప్పల్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. ఉప్పల్ సీఐ శ్రవణ్‌కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఉప్పల్ పారిశ్రామికవాడ, లక్ష్మీనారాయణ కాలనీలో ఓ ఇంట్లో గుట్టుచప్పుడు కాకుండా పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో పోలీసులు ఆ ఇంటిపై దాడి చేసి ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. రూ.40,800 నగదు, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని నిందితులను రిమాండ్‌కు తరలించారు.

నేడు మల్కాజిగిరికి మంత్రి హరీష్‌రావు



మల్కాజిగిరిలోని షికారి మల్లయ్య గ్రౌండ్‌ను పరిశీలిస్తున్న శంభీపూర్ రాజు, నందికంటి శ్రీధర్

గౌతంనగర్: మంత్రి హరీష్‌రావు గురువారం మల్కాగిరిలో జరిగే బీఆర్‌ఎస్ శ్రేణులు, నాయకులు, కార్యకర్తల సమావేశానికి హాజరుకానున్నట్లు మల్కాజిగిరి నియోజకవర్గం ఎన్నికల ఇన్‌చార్జి శంభీపూర్ రాజు, ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ నందికంటి శ్రీధర్, మల్కాజిగిరి సర్కిల్ బీఆర్‌ఎస్ ఇన్‌చార్జి ఆర్.జితేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం వారు మల్కాజిగిరిలోని షికారి మల్లయ్య గ్రౌండ్‌లో జరిగే సభ స్థలాన్ని పరిశీలించారు. సుమారు 10 వేల మందితో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం జరుగుతుందని తెలిపారు. సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మేకల రాము యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం అభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు

ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు

మౌలాలి: మౌలాలి డివిజన్ హనుమానగర్‌లో ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి బుధవారం ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం పాటుపడుతోందన్నారు. హస్తం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఎన్నికల తర్వాత ఆర్య వైశ్యుల అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు వెంకటేశ్వర్లు, గణేష్, పోచయ్య, గణేష్, రవికుమార్‌గుప్తా, వాసుదేవగుప్తా, గణేష్‌గుప్తా, కాంగ్రెస్ నాయకులు వినోద్‌యాదవ్, ఉమామహేశ్వరి, ఫెడరేషన్ అధ్యక్షులు శ్రీనివాస్, దశరథ్‌రెడ్డి, రాజారెడ్డి, శ్రీనివాస్, వెంకటేష్, భాస్కర్, జాన్‌బీ, ఖాసీంబి, సునందరావు, సంతోష్ రాందాస్, సందీప్‌గౌడ్, రఘుయాదవ్, ఆగమయ్య, మదర్ పాల్గొన్నారు.

మైనంపల్లి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరికలు

గౌతంనగర్: కాంగ్రెస్ పార్టీ గెలుపునకు కృషి చేయాలని ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అన్నారు. గౌతంనగర్ డివిజన్ పరిధిలోని ఇందిరానెహ్రూనగర్‌లో మంగళవారం రాత్రి సుమారు 300 మంది కాంగ్రెస్‌లో చేరారు.

ఉప్పల్ ఫారెస్ట్ రేంజ్ అధికారికి డాక్టరేట్



కె.శ్రీనివాస్‌రెడ్డి

ఉప్పల్: ఉప్పల్ ఫారెస్ట్ రేంజ్ అధికారి కె.శ్రీనివాస్‌రెడ్డికి ఓయూ డాక్టరేట్ పట్టాను అందుకున్నారు. తెలంగాణకు హరితహారంపై ఆయన చేసిన పరిశోధనలకు ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్‌ను అందించారు. ప్రొ.విజయభాస్కర్‌రెడ్డి నేతృత్వంలో జరిపిన పరిశోధనలకు గాను డాక్టరేట్‌ను పద్మశ్రీ శాంతాను నారాయణ్ చేతులమీదుగా ఉస్మానియా యూనివర్సిటీలో నిర్వహించిన కార్యక్రమంలో అందుకున్నారు.

కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



ప్రచారంలో కాంగ్రెస్ నేతలు

పోగుల నర్సింహరెడ్డి

బోడుప్పల్: కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు, నాయకులు పనిచేయాలని బోడుప్పల్ అధ్యక్షుడు పోగుల నర్సింహరెడ్డి అన్నారు. చెంగిచర్ల 2వ డివిజన్ పరిధిలో బృందావన్ కాలనీ, గణేష్‌నగర్, సాయినగర్, మాతా అరవింద కాలనీ, వీఎస్ఎస్‌డీ కాలనీ, ఇందిరానగర్ కాలనీల్లో బుధవారం నిర్వహించిన గడప గడపకు కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రచారం నిర్వహించారు. మేడ్చల్ నియోజకవర్గ బీ బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిశోర్‌గౌడ్, బోడుప్పల్ ప్రధాన కార్యదర్శి కొత్త ప్రభాకర్‌గౌడ్, మాజీ వార్డు సభ్యులు కుర్రి శివశంకర్, నేతలు తూర్పాటి యాదయ్య, హరినాథ్‌రెడ్డి, మేకల యాదగిరి, గణేష్‌నాయక్, ఉమేష్, శ్రీనివాస్, శ్రీకాంత్‌రెడ్డి, రాజు, సంపత్, సోమేష్‌గౌడ్, నరేందర్ రెడ్డి పాల్గొన్నారు.

ఎన్నికలకు సహకరించండి

జిల్లా ఎన్నికల అధికారి గౌతమ్



సాక్షి, మేడ్చల్‌జిల్లా: శాసనసభ ఎన్నికలను సజావుగా, ప్రశాంతగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు ఎన్నికల అధికారులకు సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి పి.గౌతమ్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియతో కలిసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులతో సమావేశాన్ని నిర్వహించారు. రాజకీయ పార్టీలకు సకాలంలో ఓటర్ల జాబితాను అందిస్తామని పేర్కొన్నారు. నామినేషన్లకు సంబంధించి పార్టీలు సువిధ యాప్ ద్వారా 48 గంటల ముందు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, ఏమైనా ఇబ్బందులు ఉంటే రిటర్నింగ్ అధికారి నుంచి అనుమతి పొందాల్సి ఉంటుందన్నారు. జిల్లాలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలతో పాటు మౌలిక వసతులు, అవసరాలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఐదు నియోజకవర్గాల్లో ఎన్నికల కేంద్రాలను మార్చిన చోట్ల అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించామని, ఇంకా ఏమైనా అవసరాలు ఉంటే తెలపాలన్నారు. రాజకీయ పార్టీలు ఎన్నికల ఖర్చుల లెక్కలు తప్పనిసరిగా చెప్పాలని సూచించారు. సమావేశంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులు, ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

నామినేషన్ల స్వీకరణకు ఏర్పాట్లు పూర్తి

శాసనసభ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియకు సంబంధించి ఐదు నియోజకవర్గాల్లో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి గౌతమ్ తెలిపారు. నామినేషన్లకు సంబంధించి ఎన్నికల కమిషన్ నిబంధనలు తప్పకుండా పాటించాలని పేర్కొన్నారు. జిల్లాలో ఎన్నికల నామినేషన్ మొదలుకొని ఓటింగ్ ప్రక్రియ, కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

ఎగ్జిట్ పోల్స్ ప్రసారాలు, ప్రచురణలపై నిషేధం

సాక్షి, మేడ్చల్‌జిల్లా: ఎన్నికలకు సంబంధించి ఎగ్జిట్ పోల్స్ ప్రసారాలు, ప్రచురణలపై ఎన్నికల సంఘం నిషేధం విధించిందని ఎన్నికల అధికారి గౌతమ్ తెలిపారు. ఎగ్జిట్ పోల్స్ ప్రభావం ఎన్నికలపై పడే అవకాశమున్నందున ప్రజా ప్రాతినిధ్యం చట్టం-1951లోని సెక్షన్ 126ఏ ప్రకారం ఎలాంటి ఎగ్జిట్ పోల్స్ నిర్వహించరాదని, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలో ప్రచురణలు, ప్రసారాలు చేయరాదని ఆయన స్పష్టం చేశారు. ఈ నెల 7 ఉదయం 7 గంటల నుంచి 30 సాయంత్రం 6.30 గంటల వరకు ఎగ్జిట్ పోల్స్ ప్రసారాలు, ప్రచురణలపై నిషేధం అమలులో ఉంటుందని పేర్కొన్నారు. ఈ విషయంలో నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరంగా రెండేళ్ల జైలుశిక్ష, జరిమానా లేదా రెండు ఉంటాయని ఎన్నికల సంఘం పేర్కొందని ఆయన తెలిపారు.

జిల్లావ్యాప్తంగా ప్రత్యేక తనిఖీలు

సాక్షి, మేడ్చల్‌జిల్లా: ఎన్నికల నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా అనేక చోట్ల తనిఖీలు నిర్వహించగా, ఇప్పటి వరకు రూ.17,64,10,901 నగదు, రూ.24,66,92,170 విలువ చేసే ఆభరణాలు, 84,445 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నట్లు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఎన్నికల అధికారి పి.గౌతమ్ తెలిపారు. ఎక్సైజ్ శాఖకు సంబంధించి 508 కేసులు నమోదు కాగా, 262 మందిని అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. తనిఖీల్లో స్వాధీనం చేసుకున్న రూ.4,20,90,417 నగదు తిరిగి అప్పగించినట్లు ఆయన తెలిపారు. జిల్లా గ్రీవెన్స్ కమిటీకి 185 కేసులు రాగా, 141 డిస్పోజ్ చేసినట్లు తెలిపారు. అలాగే ఆరు కేసులకు ఎఫ్ఐఆర్ నమోదు కాగా, ఇందులో ఒకటి ఐటీ శాఖకు సంబంధించిందని, రెండు కమర్షియల్ ట్యాక్స్‌కు చెందినవని పేర్కొన్నారు.

PANNALA RAM REDDY COLLEGE OF BUSINESS MANAGEMENT - SELF FINANCE (PRCBSF)
(Approved by AICTE, Affiliated to OU & Recognised by Govt of TS)
Ram Reddy Nagar Colony, Beside Pallavi Model School, Boduppal, Hyderabad - 500 092, T.S.
Phone : 040-64643900, 9000200222, 9908806446.
MBA SPOT ADMISSION NOTIFICATION - 2023 (PRCBSF)
MBA - (PRCBSF) INTAKE - 60
(Leftover Seats in PRCBSF Convenor Quota - 35 seats available)
Candidates with or without ICET can obtain application from college between 10.00 AM to 4.00 PM or download application from college website : www.prcbm.com and attend all necessary certificates on or before 04-11-2023 at College for institutional spot admissions.
Date : 02-11-2023 Sd/- Secretary

పెద్ద కర్మ



జననం: 01-06-1961
మరణం: 23-10-2023
కీ॥శే॥ రామగోని సదానంద గౌడ్ గారు
సమ్మక్క సారలమ్మ రెస్టారెంట్ & బార్ - ఎక్సైజ్ కాంట్రాక్టర్
మంచితి, మానవత్వానికి మారు పేరై అందరి హృదయాలలో చిరస్థాయిగా నిలిచి దైవసన్నిధికి, చేరిన మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతున్ని ప్రార్థిస్తూ...
భార్య: రామగోని పద్మ కుమారుడు: రామగోని కార్తీక్ గౌడ్
కూతుళ్ళు - అల్లుళ్ళు, కోడుకులు, బావమరుదులు, తమ్ముళ్ళు, చెల్లెళ్ళు, అత్తమ్మలు, చిన్నమ్మ కుటుంబసభ్యులు మరియు బంధుమిత్రులు.
తేది: 02-11-2023, మ॥ 01.00 గం॥లకు గురువారం,
కార్యస్థలం: యాదగిరి ఫంక్షన్ హాల్, మల్లాపూర్ మెయిన్ రోడ్, పెద్దకర్మ జరుపబడును

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220376 9912220571
9912225470 9505507657